# అభివృద్ధికి పట్టం కట్టాలి

- ఎన్నికల వేళ వచ్చే మోసగాళ్లతో జాగ్రత్త
- కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకటి రాజ్యమే..
- అన్ని సర్వేల్లోనూ బీఆర్‌ఎస్‌కే ఎక్కువ సీట్లు
- కేసీఆర్.. హ్యాట్రిక్ సీఎం కావడం పక్కా
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్‌టౌన్, నవంబర్ 25 : అభివృద్ధికి పట్టం కట్టాలని, కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకటి రాజ్యమే అని మహబూబ్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో రోడ్‌షో ద్వారా బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. వన్‌టౌన్ చౌరస్తా నుంచి ప్రారంభమైన రోడ్‌షో అశోక్ టాకీస్‌చౌరస్తా, అంబేద్కర్‌చౌరస్తా, తెలంగాణ చౌరస్తా, ఎర్ర సత్యం చౌరస్తా, డీఈవో చౌరస్తా, శెట్టికాంప్లెక్స్ చౌరస్తా, న్యూటౌన్, మెట్టుగడ్డ, పద్మావతికాలనీ మీదుగా శ్రీనివాస్‌కాలనీ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఓపెన్‌టాప్ వాహనంపై ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ.. చేసిన అభివృద్ధిని వివరిస్తూ మంత్రి ముందుకు సాగారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు

నాయకులు, కార్యకర్తలు దారి వెంట వెళ్తూ దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. రోడ్‌షోకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. శ్రీనివాసకాలనీ చౌరస్తాలో మంత్రి ప్రసంగించారు. చివరి రోజు వరకు అప్రమత్తంగా ఉండి పని చేయాలని సూచించారు. మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. ఐటీ పార్కు, అమర్ రాజా కంపెనీతో ఎంతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశలు వస్తాయన్నారు. కొత్త కంపెనీలో ఉద్యోగాలు భర్తీ చేస్తాం.. ఇంక కంపెనీలు తెచ్చి యువత భవిష్యత్తు కోసం కృషి చేస్తాను. అభివృద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టాలని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమన్నారు. నేడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. మరో సారి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కార్యకర్తలు, నాయకులతో కలిసి శ్రీనివాసకాలనీలో ఛాయ్‌తాగారు.

### రేవంత్‌రెడ్డికి బీసీలు అంటే చిన్న చూపు

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి బీసీలు అంటే చిన్న చూపు అని మంత్రి డాక్టర్ వీ.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా కేంద్రం లోని గౌలి వీధి నుంచి పాన్‌చౌరస్తా వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించి తెలంగాణ ప్రభుత్వం చేసిన పనులు, మహబూబ్‌నగర్‌లో జరిగిన అభివృద్ధిని వివరించారు. అనంతరం కార్నర్ మీటింగ్ ద్వారా మాట్లాడారు. పొరపాటున కాంగ్రెస్ పార్టీకి అవకాశం అందిస్తే.. అభివృద్ధి చెందుతున్న మహబూబ్‌నగర్‌ను ఆగం చేస్తారని మంత్రి ప్రజలకు వివరించారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు టూరిస్టుల మాదిరిగా వచ్చాయని ఎన్నికలు అయిపోగానే పెట్టాబేడా సర్దుకుని వెళ్లి పోతారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ముత్యాల ప్రకాశ్, ఎంఐఎం జిల్లా యువత అధ్యక్షుడు జాకీర్, కౌన్సిలర్ వేదవ్రత్, నాయకులు చిన్న, శంకర్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా చైర్మన్ గంజివెంకన్న, డీసీసీబీ చైర్మన్ వెంకటయ్య, పి.చంద్రశేఖర్, రైతుబంధు సమితి జిల్లా



ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు శివ రాజ్, కార్యదర్శి మున్సిపల్ వైస్ చైర్మన్ తాటి గణేశ్, కౌన్సిలర్లు రామ్‌లక్ష్మణ్, షబ్బీర్, కట్టార వీషన్ రెడ్డి, పటేల్‌ప్రవీణ్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ రామలింగం, నాయకులు ఇక్బాల్, సమాద్‌ఖాన్, వాహెద్‌తాజ్, వినయ్, డాక్టర్ అహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతు, బాబుల్‌రెడ్డి, శ్రీను, శేఖర్, రాజశేఖర్, ఇమ్రాన్, సుల్తాన్, శాంతిభూషణ్, నరేందర్ పాల్గొన్నారు.

# అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

మరికల్, నవంబర్ 25 : గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోని మరికల్ మండలాన్ని 9 సంవత్సరాల్లో ఎంతో అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదిస్తే నారాయణ పేట నియోజకవర్గంలో మరికల్ మండలాన్ని అగ్రగామిగా నిలుపుతానని నారాయణ పేట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మరికల్ మండలం కోసం 30 ఎండ్లుగా ఎదురు చూశారని అలాంటి కలను నెరవేర్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఎస్‌ఆర్‌రెడ్డిదేనే విషయం మరికల్ ప్రజలు మరువరాదని అన్నారు. నియోజకవర్గానికి కేంద్ర బిందువైన మరికల్ అభివృద్ధికి నిరంతరం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని తెలిపారు. కాంగ్రెస్ మాయమాటలకు మోసపోకుండా బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. నారాయణపేట రోడ్ నుంచి ప్రారంభమైన రోడ్ షో చౌరస్తా, గాంధీరోడ్, హరిజన్‌వాడ, కుర్వగేరి మీదిగా జరిగింది. మరికల్ మండలం కాకుండా అడ్డుకున్న ఘనత మీదని అన్నారు. మండలం ఏర్పాటుతో మరికల్ అభివృద్ధి చెందుతుందని, హైవేలను ఏర్పాటు చెయ్యడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ పేట జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గౌని సురేఖరెడ్డి, ఎంపీపీ శ్రీకళరెడ్డి, మండల రైతుబంధు సమితి కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, నాయకులు రాజవర్ధన్ రెడ్డి, హన్మిరెడ్డి, రామస్వామి, సర్పంచ్ కుర్వగోపి, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

నర్వ, నవంబర్ 25 : కళ్లబోల్లి మాటలు చెప్పే కాంగ్రెస్ నాయకుల మాయ మాటలను నమ్మొద్దని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మక్తల్ ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం లోని నర్వ మండలం బెక్కర్‌పల్లి, పెద్దకడ్మూర్, ఎల్లంపల్లి, కొత్తపల్లి, లక్కర్ దొడ్డి, నాగిరెడ్డిపల్లి, యాంకి, జక్కన్నపల్లి, రాయికోడ్, సీపూర్, కల్వాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాల్లో పర్యటించి రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెపల్లెల్లో మంగళహారతులతో మహిళలు ఎమ్మెల్యే చిట్టెంకు స్వాగతం పలికారు. బొడ్డెమ్మలు, కోలాటలతో నృత్యాలు చేస్తూ ప్రతి గ్రామంలో ఆలయాల్లో పూజలు చేసి రోడ్‌షోలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే చిట్టెం మాట్లాడుతూ కొత్త బిచ్చగాడు పొద్దెరుగడన్నట్లు, బతుకు దెరువు కోసం వెళ్లి ఐదు ఏండ్ల కోసారి బండారుకు వచ్చినట్లు కాంగ్రెస్ వ్యవహారం ఉందని ఆయన ఎద్దేవా చేశారు. స్థానికంగా ఉండారు ఎన్నికల సీజన్‌కు వస్తారు మాయ మాటలు చెప్పి పత్తా లేకుండా పోయే వాళ్ల మాటలు నమ్మకుండన్నారు. అనేక సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేసి, తెలంగాణలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేశా



నాగిరెడ్డిపల్లిలో కారు గుర్తుకు ఓటెయ్యాలని కోరుతున్న ఎమ్మెల్యే చిట్టెం

రని పేర్కొన్నారు. గ్రామాల్లో మరింత అభివృద్ధి చేసుకునేందుకు ప్రతిఒక్కరూ కారు గుర్తుకు ఓటేయ్యాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జయరాములు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, నాయకులు కిరణ్ ప్రకాశ్ రెడ్డి, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్, అయ్యన్న, హన్మంత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

# ఓర్వలేకనే కాంగ్రెస్ విమర్శలు

- దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- పనిచేసే ఎమ్మెల్యే ఆలను గెలిపించండి : ఎంపీ మన్నె



భూత్పూర్‌లో రోడ్‌షోలో పాల్గొన్న ఎమ్మెల్యే , ఎంపీ

భూత్పూర్, నవంబర్ 25 : అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కేంద్రం తోపాటు అమిస్తాపూర్‌లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ భూత్పూర్ మండలమే నాకు మొదటగా రాజకీయ గుర్తింపును ఇచ్చిందన్నారు. 2006 జెడ్పీటీసీగా పోటీ చేసినప్పుడు 4,438ఓట్ల మెజార్టీతో గెలిపించారని, టీఆర్‌ఎస్ పార్టీ తరఫున 2014లో మొదటిసారి ఎమ్మెల్యేకు పోటీ చేస్తే 7,500ఓట్ల మెజార్టీని ఇచ్చారని, రెండో సారి ఎమ్మెల్యేకు పోటీ చేస్తే 10,500 మెజార్టీని ఇచ్చారని పేర్కొన్నారు. ఈ మండల ప్రజల కష్టాలను శాశ్వతంగా తీర్చడానికే కరివెనకు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును తీసుకువచ్చానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేగా నేను ఏం పనిచేయలేదని విమర్శిస్తున్నాడు. నేను అభివృద్ధి చేశానో లేదో నీ సొంత మండలంలో నీ గ్రామంలో వెళ్లి అడుగు నేను ఏమి అభివృద్ధి చేశానో చెబుతారు. మాజీ మంత్రి చిన్నారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మంత్రిగా ఉండి తన సొంత నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. అనంతరం ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉండే ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దిట్ట ఆయన గెలిస్తే దేవరకద్ర నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, వైస్‌చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, గడ్డంనాగమ్మ, రామకృష్ణ, కృష్ణవేణి, బాలకోటీ, ముడా డైరెక్టర్లు చంద్రశేఖర్ గౌడ్, సాయిలు, కోఆప్షన్లు అజీజ్, జాకీర్, మాజీ సర్పంచులు నారాయణగౌడ్, సత్యానారాయణ, నాయకులు మురళీధర్‌గౌడ్, గోప్లాపూర్ సత్యానారాయణ, సురేశ్‌గౌడ్, బాల స్వామి, అశోక్ గౌడ్, గడ్డం రాములు, నర్సింహులు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

## శ్రీశైలంలో నేడు పౌర్ణమి వేడుకలు



శ్రీశైలంలో దర్శనాల కోసం బారులుదీరిన యాత్రికులు

శ్రీశైలం, నవంబర్ 25 : శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నాం తరువాత పౌర్ణమి ఘడియలు ప్రారంభం కావడంతో సాయంత్రం కృష్ణానది వద్ద నదీమ తల్లికి గంగాహారతి కార్యక్రమం చెయ్యనున్నట్లు చెప్పారు. ప్రదోషకాల సమయంలో ప్రధానాలయం గంగాధర మండపం వద్ద జ్వాలా తోరణం కార్యక్రమం, పుష్కరిణి వద్ద దశవిధ హారతులు, లక్షదీపార్చన కార్యక్రమాలు జరిపించనున్నట్లు పేర్కొన్నారు. పౌర్ణమి రోజు జరిగే ప్రత్యేక కార్యక్రమాలను వీక్షించేందుకు వస్తున్న యాత్రికులకు తగిన వసతులు కల్పిస్తున్నట్లు ఈవో అన్నారు. వరుసగా సెలవుదినాలు కావడం, పౌర్ణమి రోజు కలిసిరావడంతో వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న యాత్రికులతో శ్రీశైల పుర వీధులు సందడిగా మారాయి. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసుకొని స్వామిఅమ్మవార్ల మెక్కులు తీర్చుకుంటూ దర్శనాలు చేసుకునంటున్నారు.

## భక్తులతో స్నేహపూర్వకంగా మెలగాలి

శ్రీశైలం, నవంబర్ 25 : శ్రీశైల మహా క్షేత్రానికి వచ్చే యాత్రికులతో స్నేహపూర్వకంగా ఉండాలని ఆలయ సెక్యూరిటీ సిబ్బంది, శివసేవకులకు ఈవో పెద్దిరాజు ఆదేశించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆలయ భద్రతా అధికారితో సహా సెక్యూరిటీ సిబ్బంది చేస్తున విధులలో నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. క్యూలైన్లు, ఆర్జితసేవా టిక్కెట్ కౌంటరు, అన్నదాన భవనం, లడ్డూ విక్రయ కేంద్రాలు, విరాళాల కౌంటర్ల వద్ద యాత్రికులు అడిగే సమాచారాన్ని పూర్తిగా అందించడంతోపాటు వారిని స్వామి అని లేదా శివ అని సంబోధించాలని చెప్పారు. గత కొంత కాలంగా యాత్రికుల నుండి వచ్చిన ఫిర్యాదులు పునరావృతం కాకుండా విధులు నిర్వహించాలని అన్నారు.

## శ్రీశైలంలో తృటిలో తప్పిన ప్రమాదం

శ్రీశైలం, నవంబర్ 25 : శ్రీశైల మహా క్షేత్రం వలయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. శనివారం ఉదయం విజయవాడకు చెందిన మినీ టూరిస్ట్ వ్యాన్‌లో క్షేత్రానికి వచ్చిన యాత్రికులను గమ్యస్థానంలో దించి వాహనాన్ని పార్కింగ్ చేసుకునేందుకు బైపాస్ గుండా వెళ్తుండగా అకస్మాత్తుగా అదుపుతప్పిన వ్యాను బోల్తా పడింది. ప్రమాదం సమయంలో వ్యానులో కేవలం డ్రైవర్ మాత్రమే ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న దేవస్థానం అధికారులు పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు.